తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
07 మే 2026
సంపుటి 03
సంచిక 209
పేజీలు 8
వెల రూ. 5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# పసికందును అమ్మేసిన నర్సు

- తల్లిని మోసం చేసి రూ.లక్షన్నరలకు నవజాత శిశువు విక్రయం
- మెదక్ జిల్లాలో అమానుష ఘటన కలకలం
- ఐదు రోజుల తర్వాత బతికే ఉందన్న విషయం తెలుసుకున్న తల్లి



మెదక్, మే 06 మెదక్ జిల్లాలో మానవత్వానికే మచ్చ తెచ్చే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పుట్టిన పసికందు చనిపోయిందని ఓ తల్లిని నమ్మించిన నర్సు, ఆ నవజాత శిశువును రహస్యంగా రూ. 1.50 లక్షలకు విక్రయించిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ అమానుష ఘటన బయటపడటంతో జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాపన్నపేట మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన నస్రా ఫాతిమా ప్రస్తుతం సికింద్రాబాద్ మౌలాలిలో నివసిస్తోంది. ఏడు నెలల గర్భిణిగా ఉన్న ఆమె ఇటీవల అత్తగారింటికి వెళ్లేందుకు మెదక్‌కు వచ్చింది. ఈ సమయంలో బస్టాండ్ వద్ద చేతిలో ఉన్న చిప్స్ ప్యాకెట్‌పై కోతులు దాడి చేయడంతో తీవ్ర భయానికి గురైంది. అక్కడున్న స్నేహితురాలు వెంటనే ఫాతిమాను సమీప ఆసుపత్రికి తరలించింది. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించగా ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అక్తరీ బేగం అత్యంత దారుణంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వెలువడ్డాయి.

పుట్టిన పాప చనిపోయిందని ఫాతిమాను నమ్మించిన నర్సు, ఆమె దుఃఖంలో ఉండగానే శిశువును రహస్యంగా విక్రయించినట్లు సమాచారం. నర్సు మాటలను నమ్మిన బాధితురాలు కన్నీటి పర్యంతమై మూడు రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిపోయింది. కానీ ఐదు రోజుల తర్వాత ఓ వ్యక్తి ద్వారా తన పాప బతికే ఉందన్న సమాచారం ఫాతిమాకు చేరింది. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన ఆమె వెంటనే పోలీసులను ఆశ్రయించి నర్సుపై ఫిర్యాదు చేసింది.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శిశువును ఎవరికీ విక్రయించారు?, ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు ఉన్నారు?, ఆసుపత్రి సిబ్బంది పాత్ర ఉందా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. పుట్టిన బిడ్డ కోసం తల్లి విలపిస్తుంటే, డబ్బుల కోసం పసికందును అమ్మేయడం అమానుషమని ప్రజలు మండిపడుతున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

➤ మిగతా 2వ పేజిలో..




## కళాశాలలో ర్యాగింగ్ కలకలం

- సీనియర్లు, జూనియర్ల మధ్య ఘర్షణ ఆలస్యంగా వెలుగులోకి
- ఫోన్ లాక్కోవడంతో వివాదం
- ర్యాగింగ్ ఘటనపై కౌన్సెలింగ్ నిర్వహించిన కళాశాల యాజమాన్యం

వరంగల్, మే 06 వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలో ఉన్న బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో జరిగిన ర్యాగింగ్ తరహా ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల బీఎస్సీ నర్సింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు, ఫస్ట్ మరియు సెకండ్ సెమిస్టర్ చదువుతున్న జూనియర్ విద్యార్థినుల మధ్య జరిగిన వాగ్వాదం కళాశాలలో కలకలం రేపింది. సమాచారం ప్రకారం ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లే బస్సు డీజిల్ ఖర్చుల కోసం జూనియర్ విద్యార్థిని సీనియర్లను ఫోన్ ద్వారా సంప్రదించి డబ్బులు అడిగినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సీనియర్ విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ "జూనియర్‌వి మమ్మల్నే డబ్బులు అడుగుతావా?" అంటూ దురుసుగా మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయి

➤ మిగతా 2వ పేజిలో..



## ఆకతాయిల ఆటకట్టించిన మహిళా సీపీ

- సాధారణ మహిళగా బస్టాండ్‌లో నిలబడ్డ మల్కాజిగిరి సీపీ సుమతి
- అర్ధరాత్రి ప్రత్యేక ఆపరేషన్‌తో పోకిరీల అసలు రంగు బయటపెట్టడం
- యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

హైదరాబాద్, మే-06 మహిళల భద్రత కోసం మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి స్వయంగా రంగంలోకి దిగారు. ఇటీవలే మల్కాజిగిరి సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం అర్ధరాత్రి కీలక ఆపరేషన్ నిర్వహించి ఆకతాయిల ఆగడాలను బయటపెట్టారు. సీపీ సుమతి సాధారణ మహిళలా మారి బస్టాండ్‌లో ఒంటరిగా నిలబడ్డారు. అక్కడ ఉన్నవారికి ఆమె పోలీస్ కమిషనర్ అన్న విషయం తెలియకపోవడంతో పలువురు యువకులు ఆమె చుట్టూ చేరి వేధింపులకు పాల్పడ్డారు. సుమారు నలభై మంది వరకు యువకులు ఆమెను ప్రశ్నలతో ఇబ్బంది పెట్టినట్లు సమాచారం. ఈ ఘటనలో ఎక్కువ మంది

➤ మిగతా 2వ పేజిలో..

## రాబంధు రాజ్యం పోయి "రైతుబంధు కేసీఆర్ రాజ్యం" వస్తుంది





- రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది
- రైతు సంగ్రామ సదస్సులో కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రైతులకు నాలుగు కీలక తీర్మానాలు ప్రకటించిన బీఆర్ఎస్
- రైతు డిక్లరేషన్‌పై ఆగ్రహం
- రైతు భరోసాపై కేటీఆర్ ప్రశ్నల వర్షం

హనుమకొండ, మే 06 రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ నయవంచనకు బలికావద్దని, గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు సోదరులకు విజ్ఞప్తి చేశారు. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని, రెండేళ్లలో "రాబంధు రాజ్యం" పోయి "రైతుబంధు కేసీఆర్ రాజ్యం" వస్తుందని ధీమా వ్యక్తం

➤ మిగతా 2వ పేజిలో..

## ఫీజుల దోపిడీపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

- నాణ్యమైన విద్య -- ఫీజుల నియంత్రణ రౌండ్ టేబుల్ సమావేశంలో కల్వకుంట్ల కవిత
- ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం
- మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్

హైదరాబాద్, మే 06 హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన "నాణ్యమైన విద్య -- ఫీజుల నియంత్రణ" రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు.



ఈ సందర్భంగా విద్యా వ్యవస్థ, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపు, ప్రభుత్వ బాధ్యతలపై ఆమె తీవ్ర స్థాయిలో స్పందించారు. ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపుపై ప్రభుత్వం స్పందించడం లేదని కవిత విమర్శించారు. కొన్ని పాఠశాలలు యాభై శాతం నుంచి నూట ఇరవై శాతం వరకు ఫీజులు

➤ మిగతా 2వ పేజిలో..

## ప్రపంచ వేదికపై మోదీ దౌత్య వ్యూహం

- వియత్నాంతో సంబంధాల బలోపేతానికి కీలక నిర్ణయాలు
- వాణిజ్యం, భద్రత రంగాల్లో భారత్ కొత్త లక్ష్యాలు
- ప్రపంచ ఉద్రిక్త పరిస్థితులపై ప్రధాని స్పందన



➤ 2వ పేజిలో..

# కళాశాలలో ర్యాగింగ్ కలకలం



.హాస్టల్‌లో ఫోన్ ఎలా ఉపయోగిస్తున్నావంటూ ప్రశ్నిస్తూ బాధితురాలి ఫోన్‌ను లాక్కున్నట్లు సమాచారం. దీంతో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి వివాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై జూనియర్ విద్యార్థిని సోదరుడు ఆందోళన వ్యక్తం చేశాడు. తన సోదరికి ఏదైనా హాని జరుగుతుందేమోనన్న భయంతో బాధితురాలి సోదరుడు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు విషయం తెలిసిన వెంటనే కళాశాల ప్రిన్సిపల్ సునీత ఇరు వర్గాల విద్యార్థినులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డే స్కాలర్లు హాస్టల్‌లోకి వెళ్లవద్దని కళాశాల యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద కూడా ఘటనపై ప్రిన్సిపల్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థులు ఇంటి నుంచి దూరంగా ఉండటం, కొత్త వాతావరణానికి అలవాటు పడే సమయంలో ర్యాగింగ్ వంటి ఘటనలు వారిలో భయాందోళనలు పెంచుతున్నాయని చెబుతున్నారు. సున్నిత మనస్తత్వం కలిగిన విద్యార్థులు ర్యాగింగ్‌ను తట్టుకోలేక మానసికంగా కుంగిపోతున్నారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ర్యాగింగ్ సంస్కృతి పూర్తిగా నిర్మూలించేందుకు కళాశాలలు కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ఆకతాయిల ఆటకట్టించిన మహిళా సీపీ

విద్యార్థులే ఉండటం గమనార్హంగా మారింది. మహిళలు రాత్రి వేళల్లో ఎదుర్కొనే ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకే ఈ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. కొంతసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న పోలీసులు ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల భద్రత విషయంలో రాజీపడబోమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజా ప్రదేశాల్లో మహిళలను ఇబ్బంది పెట్టే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని వెల్లడించారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని పోలీసులు సూచించారు.

# రాబంధు రాజ్యం పోయి "రైతుబంధు కేసీఆర్ రాజ్యం" వస్తుంది

చేశారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో పాల్గొన్న కేటీఆర్ రైతుల పక్షాన నాలుగు కీలక తీర్మానాలను ప్రకటించారు.

కాంగ్రెస్ పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని ఆరోపించిన కేటీఆర్, రోడ్డున పడిన ప్రతి రైతు కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన 34 హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. అన్ని పంటలను ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.500 బోనస్‌తో కొనుగోలు చేయాలని, రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి కాని రైతులకు వెంటనే రుణ విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, రైతు బీమా పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ తీర్మానాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. "ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి సాక్షిగా రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వెళ్లి ఒక్క ఊరిలో అయినా రైతులందరికీ పూర్తి రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ "చారానా.. టోపీ బారానా"లా మారిందని ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో దందాలు, కమీషన్లు, కొట్లాటలే కనిపిస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి 69 సార్లు ఢిల్లీకి వెళ్లినా రాష్ట్రానికి 69 పైసలు కూడా తీసుకురాలేదన్నారు. ఆయన "రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యువల్ సీఎం" అంటూ సెటైర్లు వేశారు. ఢిల్లీకి వెళ్లి కప్పం కడుతున్నారని, రాష్ట్రంలో "రాహుల్ బంధు" నడుస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. రైతులకు ఇవ్వడానికి పైసలు లేవు కానీ రాహుల్ గాంధీకి మాత్రం మూటలు పంపుతున్నారని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ రైతులకు బోగస్ పత్రం ఇచ్చి మోసం చేసిందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులను దేశంలోనే నంబర్‌వన్ స్థాయిలో నిలబెట్టామని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రైతు ప్రగతికి కేసీఆర్ అద్భుతమైన పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. రైతుబంధు పథకాన్ని దేశంలోని పన్నెండు రాష్ట్రాలు అనుసరించాయని గుర్తుచేశారు. పదేళ్లలో రైతుల కోసం రూ.5 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేసిన నాయకుడు కేసీఆర్ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో పడేవని గుర్తుచేశారు. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం మాత్రమే ఒక్కసారి రైతు భరోసా ఇచ్చారని విమర్శించారు. లక్సెట్టిపేట కొనుగోలు కేంద్రంలో గోడ కూలి నలుగురు రైతులు మరణించారని, ధాన్యం కొనుగోలు కోసం రైతులు వానల్లో, ఎండల్లో పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత దుస్థితులు తిరిగి వస్తున్నాయని అన్నారు. రైతు డిక్లరేషన్ అమలు కోసం రైతులు కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. "రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలి" అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీకి పిండం పెడితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. మక్కలు కొనకపోతే ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో రైతుల కోసం బీఆర్ఎస్ మళ్లీ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ హయాంలో అమలైన పథకాలను తిరిగి తీసుకొచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు.

# ఫీజుల దోపిడీపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి



పెంచినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం ప్రభుత్వాల బాధ్యతేనని ఆమె స్పష్టం చేశారు. సమానత్వం, స్వేచ్ఛ, మానవ విలువలు విద్య ద్వారానే సాధ్యమని ప్రపంచం గుర్తించిందన్నారు. పిల్లల చదువు బాధ్యత కేవలం తల్లిదండ్రులదే కాదని, ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో నడుస్తున్నాయని కవిత ఆరోపించారు. రాజకీయ నాయకులకు చెందిన విద్యాసంస్థలే ఎక్కువగా ఉన్నాయని, విద్యను వ్యాపారంగా మార్చడం ఆందోళనకరమని అన్నారు. ఫీజుల దోపిడీకి తక్షణ పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో అరవై నాలుగు లక్షల మంది విద్యార్థుల్లో ఎక్కువ శాతం ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారని ఆమె తెలిపారు. పిల్లలు బాగా చదువుకోవాలన్న తల్లిదండ్రుల బలహీనతను కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపారంగా మార్చుకున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేసి గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఈ ఏడాది నూట ఇరవై శాతం ఫీజులు పెంచడాన్ని కవిత తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న పాఠశాలలోనే ఇంత భారీగా ఫీజులు పెరగడం దౌర్భాగ్యమని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వేల కోట్ల రూపాయల మేర పేరుకుపోయాయని కవిత పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని బలహీనపరిచేలా తీసుకొచ్చిన జీవోలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్య, వైద్యం విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని ఆమె స్పష్టం చేశారు. తమిళనాడు తరహాలో ఫీజుల నియంత్రణకు శాశ్వత అథారిటీ ఏర్పాటు చేయాలని, లేదా గుజరాత్ మాదిరిగా ఫీజులకు పరిమితి విధించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. విద్య, వైద్యం అంశాల్లో ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కవిత కోరారు.

# ఒకే కాన్పులో నలుగురు శిశువులకు జన్మనిచ్చిన మహిళ

- నెలలు నిండకముందే పురిటి నొప్పులు
- ఇద్దరు మగబిడ్డలు.. ఇద్దరు ఆడబిడ్డలు
- దేవుడిచ్చిన వరమంటూ ఆనందం వ్యక్తం చేసిన తండ్రి



షియోపూర్, మే-06 మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని షియోపూర్ జిల్లాలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఒక మహిళ తన తొలి ప్రసవంలోనే ఒకే కాన్పులో నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. ఈ వార్త స్థానికంగా ఆసక్తి కలిగించగా, వైద్యులు కూడా దీనిని ప్రత్యేక సంఘటనగా పేర్కొన్నారు. వీర్‌పూర్ తాలూకా బేరుపుర గ్రామానికి చెందిన పూజ, హుకుమ్ సుమన్ దంపతులకు ఈ నలుగురు పిల్లలు జన్మించారు. ప్రసవానికి ఇంకా పూర్తి నెలలు కాకముందే పూజకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గర్భధారణకు ఏడు నెలలు కూడా పూర్తికాకముందే కాన్పు జరగడంతో శిశువుల ఆరోగ్యంపై భయం నెలకొంది. అయితే వైద్యుల పర్యవేక్షణలో జరిగిన ప్రసవంలో ఒకరి తర్వాత ఒకరు గంట వ్యవధిలో నలుగురు శిశువులు జన్మించారు. వారిలో ఇద్దరు మగబిడ్డలు కాగా, మరో ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. షియోపూర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ప్రసవం జరిగింది. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో శస్త్రచికిత్స ద్వారా కాన్పు నిర్వహించడం జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. కానీ పూజకు సహజ ప్రసవం జరగడం విశేషమని తెలిపారు. ప్రసవం అనంతరం తల్లి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు. ప్రస్తుతం నలుగురు శిశువులూ ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో ఉన్నారు. ఒక్కో శిశువు సుమారు ఒక కిలో బరువుతో జన్మించినట్లు వైద్యులు తెలిపారు. సాధారణ బరువుతో పోలిస్తే ఇది తక్కువ కావడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందించిన పిల్లల తండ్రి హుకుమ్ సుమన్ ఆనందం వ్యక్తంచేశారు. ఒకేసారి నలుగురు పిల్లలు జన్మించడం తమ కుటుంబానికి దేవుడిచ్చిన వరమని తెలిపారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రపంచ వేదికపై మోదీ దౌత్య వ్యూహం


- వియత్నాంతో సంబంధాల బలోపేతానికి కీలక నిర్ణయాలు
- వాణిజ్యం, భద్రత రంగాల్లో భారత్ కొత్త లక్ష్యాలు
- ప్రపంచ ఉద్రిక్త పరిస్థితులపై ప్రధాని స్పందన



న్యూఢిల్లీ, మే-06ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న సమయంలో భారత్ తన దౌత్య వ్యూహాలను మరింత బలోపేతం చేస్తోంది. ముఖ్యంగా ఆసియా ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా వియత్నాంతో సంబంధాలను మరింత విస్తరించే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌తో సమావేశం అనంతరం చేసిన ప్రకటనలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భారత్, వియత్నాం మధ్య వాణిజ్యాన్ని 2030 నాటికి 25 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు వేగంగా పెరుగుతున్నాయని, రానున్న సంవత్సరాల్లో మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, ఇంధనం, సముద్ర వాణిజ్యం, రక్షణ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత అత్యంత కీలకమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. సముద్ర మార్గాల స్వేచ్ఛ, అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ విషయంలో భారత్ తన వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని చెప్పారు. ప్రపంచ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించే సముద్ర మార్గాల భద్రత కోసం భారత్, వియత్నాం కలిసి పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రకటనకు అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు అరుదైన ఖనిజ వనరుల రంగంలో సహకారం పెంచేందుకు రెండు దేశాలు అంగీకరించాయి. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలు, సాంకేతిక పరిశ్రమలకు కీలకంగా మారనున్న ఈ ఖనిజాల విషయంలో భారత్ దీర్ఘకాల వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంలో వియత్నాం కీలక భాగస్వామిగా మారే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై కూడా ప్రధాని మోదీ స్పందించారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, దాడులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పౌరులు, మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించారు. అమాయక ప్రజలపై దాడులు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కావని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి యుద్ధం కాకుండా సంభాషణ, దౌత్య మార్గాలే సరైనవని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలు శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ ఎప్పటికీ శాంతి, అభివృద్ధి, సహకారానికి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. ఇదిలావుండగా భారత్ అంతర్జాతీయ వేదికపై తన ప్రభావాన్ని మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో సంబంధాలను బలోపేతం చేస్తూ ఆసియా ప్రాంతంలో వ్యూహాత్మక సమతౌల్యాన్ని కాపాడాలని భారత్ ప్రయత్నిస్తోందని భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చిత పరిస్థితుల్లో ఉండగా కొత్త వాణిజ్య భాగస్వామ్యాలు, సరఫరా వ్యవస్థల బలోపేతం అత్యంత అవసరమైందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వియత్నాంతో భారత్ కుదుర్చుకుంటున్న భాగస్వామ్యం భవిష్యత్తులో కీలక పాత్ర పోషించే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. ప్రధాని మోదీ తాజా ప్రకటనలతో భారత్ అంతర్జాతీయ దౌత్యంలో మరింత చురుకైన పాత్ర పోషించబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ రాజకీయాలు వేగంగా మారుతున్న సమయంలో భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుంటూనే ప్రపంచ స్థిరత్వానికి సహకరించే దిశగా ముందుకు సాగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి మేయర్ కృషి ప్రశంసనీయం

## వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



వరంగల్ ప్రతినిధి, మే 6,తరంగాలు : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశం ముగింపు సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి ని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధిలో మేయర్ గుండు సుధారాణి కృషి ప్రశంసనీయమని తెలిపారు. నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారుల విస్తరణ, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు వంటి అంశాల్లో మేయర్ తీసుకుంటున్న చర్యలు ప్రజలకు మేలు చేస్తున్నాయని అన్నారు. తాను ఎంపీగా కూడా వరంగల్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడం, స్మార్ట్ సిటీ, అమృత్ పథకాల అమలులో సహకారం అందించడం, డ్రైనేజ్, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి ఎంపీకి ధన్యవాదాలు తెలియజేస్తూ, నగర అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# సినిమా పేరుతో 25 లక్షల మోసం

## సంగీత దర్శకుడు పలాశ్ మచ్చల్‌పై కేసు

ముంబయి,మే6 ప్రేమపేరుతో టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన ను మోసం చేసినప్రముఖ సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్ పై మహారాష్ట్రలోని సాంగ్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్మృతి మంధాన స్నేహితుడు విజ్ఞాన్ ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ పరిణామం చోటుచేసుకుంది. విజ్ఞాన్ ప్రకాశ్ తన ఫిర్యాదులో పలాశ్ ముచ్చల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక సినిమా ప్రాజెక్టు కోసం పలాశ్ తన వద్ద నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నారని, అయితే ఆ తర్వాత తనను మోసం చేశారని విజ్ఞాన్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు 22న ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ సమయంలో పలాశ్ తన కులాన్ని ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సాంగ్లీ పోలీసులు పలాశ్ ముచ్చల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. దీనిపై పలాశ్ ముచ్చల్ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది.

THARANGALU DAILY NEWS
గురువారం, 07 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ఇల్లందు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాలు వేలం పాట



**ఇల్లందు ప్రతినిధి మే 6,( తరంగాలు):**
ఇల్లందు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ లో గురువారం ఉదయం 11 గంటలకు ద్విచక్ర వాహనాల వేలంపాట నిర్వహించనున్నారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, పాన్ కార్డు తో ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో జరుగు వేలంపాటకు హాజరు కావాలని, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బస్సులో బంగారం పర్సు మిస్సింగ్ దొరికిన వారు తిరిగి ఇవ్వాలని బాధితురాలి విజ్ఞప్తి

**జఫర్గడ్ ప్రతినిధి, మే6, (తరంగాలు ):**
స్టేషన్ ఘనపూర్ నుండి హిమ్మత్ నగర్ గ్రామానికి వెళ్తున్న వరంగల్-1 డిపో బస్సులో బంగారం ఉన్న పర్సు మిస్సింగ్ అయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. హైదరాబాద్ నుండి తమ్మడపల్లి జి గ్రామానికి వివాహ కార్యక్రమానికి వెళ్తున్న ముహమ్మద్ సైదాబీ, సాహెబ్ హుస్సేన్ దంపతులు ఈఘటనకు గురయ్యారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, స్టేషన్ ఘనపూర్ నుండి జఫర్ఘడ్ వరకు ప్రయాణం చేస్తూ టికెట్ తీసుకునే సమయంలో పర్సులో నుంచి కొంత నగదు తీసి, పర్సును పక్కన పెట్టి మరిచిపోయింది. అనంతరం జఫర్ఘడ్ వద్ద దిగిన తర్వాత చూసే సరికి పర్సు కనిపించకపోవడంతో ఆమె తీవ్ర ఆందోళనకు గురైంది. అప్పటికే ఆ బస్సు హిమ్మత్ నగర్ నుండి తిరిగి హన్మకొండకు వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆ పర్సులో సుమారు 2 తులాల నల్లపూసల బంగారం గొలుసు,రూ. 3,000 నగదు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. ఈ ఘటనపై సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయగా, పోలీసులకు పిర్యాదు చేయగా పోలీస్ లు స్పందించి దర్యాప్తు చేపట్టారు. సమాచారం తెలిసిన వారు బస్సు సిబ్బంది, ప్రయాణికుల వివరాలు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పెళ్లి కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరగడంతో బాధితురాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, తన పర్సు దొరికిన వారు మానవతా దృక్పథంతో స్పందించి తిరిగి అందజేయాలని వవిజ్ఞప్తి చేసింది. తెలిసిన వారు పోలిస్టేషన్ కి 8712685045 నంబరకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

## గోడలో శవం దాచిన ప్లంబర్ అరెస్ట్

- నాలుగు నెలల తర్వాత బయటపడిన నేరేడ్‌మెట్ హత్య కేసు
- భార్యను దూషించాడనే కోపంతో స్నేహితుడి హత్య
- గోడ కూల్చగా కుళ్లిపోయిన మృతదేహం వెలుగులోకి




**హైదరాబాద్, మే 06 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**
హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నాలుగు నెలల క్రితం హత్య చేసి మృతదేహాన్ని గోడలో దాచిన ప్లంబర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తగా అద్దెకు దిగిన కుటుంబానికి దుర్వాసన రావడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్ధిపేట జిల్లాకు చెందిన మల్లేశం ప్లంబర్‌గా పనిచేస్తూ నేరేడ్‌మెట్ జీకే కాలనీలో అద్దె గదిలో నివసిస్తున్నాడు. అయితే నాలుగు నెలలుగా అతను కనిపించకపోవడంతో ఇంటి యజమాని పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో ఆ గదిని మరో కుటుంబానికి అద్దెకు ఇచ్చాడు. కొత్తగా వచ్చిన కుటుంబ సభ్యులు గదిని శుభ్రం చేస్తుండగా వంటగది సమీపంలోని గోడ నుంచి తీవ్ర దుర్వాసన రావడాన్ని గుర్తించారు. విషయం ఇంటి యజమానికి చెప్పడంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని గోడను తొలగించగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం బయటపడింది. మొదట చనిపోయింది మల్లేశమేనని భావించిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వెంకటరాములు అని గుర్తించారు. అతడు దినసరి కూలీగా జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు మల్లేశం కదలికలను సెల్‌ఫోన్ ఆధారంగా ట్రాక్ చేసి జూబ్లీ బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మల్లేశం నేరాన్ని అంగీకరించాడు. గత ఏడాది డిసెంబర్‌లో పని దొరకక ఇద్దరూ కలిసి మద్యం సేవించారని, ఆ సమయంలో వెంకటరాములు తన భార్యపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో కోపోద్రిక్తుడై కర్రతో తలపై దాడి చేశానని ఒప్పుకున్నాడు. వెంకటరాములు అక్కడికక్కడే మృతి చెందడంతో మల్లేశం సాక్ష్యాలు మాయం చేసేందుకు గదిలోనే ఇటుకలు, సిమెంట్‌తో గోడ కట్టి మృతదేహాన్ని దాచినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇంటికి తాళం వేసి పరారైనట్లు వెల్లడించారు. మృతుడు వెంకటరాములు కుటుంబ సభ్యులతో దూరంగా ఉండేవాడని, అతని గల్లంతు గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడు మల్లేశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

## "శ్రీ వైష్ణవి ఇండస్ట్రీస్" ఘనంగా ప్రారంభోత్సవం





**తరంగాలు, మే :06, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
ఖానాపురం మండల కేంద్రానికి చెందిన తోటకూరి లావణ్య- కిషన్ దంపతులు నూతన రైస్ ఇండస్ట్రీస్ ను నిర్మించగా ఇండస్ట్రీ ప్రారంభోత్సవానికి జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు గోనెల రవీందర్, ఎస్ బి ఐ బ్యాంక్ మేనేజర్ రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి, పూజ కార్యక్రమం నిర్వహించి " శ్రీ వైష్ణవి ఇండస్ట్రీస్ ను ఘనంగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది. అనంతరం వివిధ రైస్ మిల్ యజమానులు స్విచ్ ఆన్ చేసి మోటర్ లను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బూరెల సత్యనారాయణ, కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, నర్సంపేట డివిజన్ రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంధం నరేందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సింగిరికొండ మాధవ శంకర్, కోశాధికారి రవి, స్థానిక సర్పంచ్ దాసరి రమేష్, ఊటుకూరి సాంబయ్య, వివిధ రైస్ మిల్ యజమానులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, మిత్రులు పాల్గొన్నారు.

### మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపిన

## కామేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు





**ఇల్లందు ప్రతినిధి మే 6, ( తరంగాలు):**
కామేపల్లి మండలంలో శాశ్వత సాగునీటి పరిష్కారం కొరకు కృషిచేసిన వ్యవసాయ శాఖ మాత్యులు, ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రదాత తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మాజీ జెడ్పిటిసి మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్ కుమార్, టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం, మాజీ పీఎస్ఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు, గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆర్ ఎం రవి, మాజీ ఎంపీటీసీ గబ్రు నాయక్ తదితరులు మంగళవారం నాడు హైదరాబాదులో తుమ్మల నివాసంలో స్వయంగా మంత్రిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో సాగునీటి రంగానికి బలాన్ని ఇచ్చే బుగ్గ వాగు ఎడమ వరద కాలువ పనులు సవరించిన అంచనాలకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలియజేయుటకు, కామేపల్లి మండలంలోని 25 కుంటలకు 2019 ఎకరాల ఆయకట్టు కు 24 గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీటి సమస్యకు పరిష్కారం, అదేవిధంగా రఘునాథపాలెం మండలంలో మొత్తం 13 గ్రామాలకు 31 చెరువులు బుగ్గ వాగు ద్వారా నిండే అవకాశం ఉందని, దీని ద్వారా సాగునీటి రంగానికి శాశ్వత పరిష్కారం చూపిన తుమ్మల కృషి, పట్టుదల కు కామేపల్లి మండల ప్రజలు వారి మేలును ఎప్పటికీ మరచిపోరని, అంతేకాకుండా గతంలో కూడా కామేపల్లి మండలంలో అనేక రోడ్ల తో పాటు, ఇల్లందు నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్ల పరిస్థితిని చూసి, నక్సలిజం ప్రాబల్య ప్రాంతాలలో, ఎవరు చేరుకోలేని ప్రాంతాలలో కూడా ధైర్యంగా ప్రాణాలకు తెగించి పర్యటించి రోడ్లు వేయించిన ఘనత వారికే దక్కిందని వారు తెలిపారు.

## ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మండల అభివృద్ధి అధికారి





- డాక్టర్ వనపర్తి అద్వైత

**తరంగాలు, మే:06, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
ఖానాపురం మండలం రాగం పేట, కొత్తూరు గ్రామాల్లో జరుగుతున్న ఎంఐ ట్యాంక్ పనులను మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత పరిశీలించారు. రాగంపేట గ్రామంలోని ఎం ఐ ట్యాంక్ పనులను పరిశీలించి ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోయినప్పటికీ సుమారు 200 మంది ఉపాధి కూలీలు పనుల్లో పాల్గొనడం గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ఉపాధి కూలీల సంఖ్య పెరగడానికి సర్పంచ్ ఎలగందుల రాజు తీసుకున్న ముందడుగును ప్రశంసించారు. పనులను సమర్థవంత ంగా నిర్వహించినందుకు మేట్స్ సందీప్ మరియు ప్రవీణ్ లను అభినందించి సన్మానించారు. సందర్భంగా ఎంపీడీవో అద్వైత, సర్పంచ్ రాజు ఈజీఎస్ కూలీలకు మజ్జిగ, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మరియు అవసరమైన ఔషధాలను పంపిణీ చేశారు. అనంతరం కొత్తూరు గ్రామం ఎం ఐ పనులను సందర్శించారు. ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు సర్పంచ్ జాటోత్ వినోద్, కార్యదర్శి స్రవంతి, ఈ సి అరుణ్, టి ఏ రవి పాల్గొన్నారు.

## గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి మేయర్ కృషి ప్రశంసనీయం

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**వరంగల్ ప్రతినిధి, మే 6, తరంగాలు :**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశం ముగింపు సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి ని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధిలో మేయర్ గుండు సుధారాణి కృషి ప్రశంసనీయమని తెలిపారు. నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారుల విస్తరణ, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు



వంటి అంశాల్లో మేయర్ తీసుకుంటున్న చర్యలు ప్రజలకు మేలు చేస్తున్నాయని అన్నారు. తాను ఎంపీగా కూడా వరంగల్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడం, స్మార్ట్ సిటీ, అమృత్ పథకాల అమలులో సహకారం అందించడం, డ్రైనేజ్, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి ఎంపీకి ధన్యవాదాలు తెలియజేస్తూ, నగర అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

## మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాలు -2026

- వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం



**హన్మకొండ ప్రతినిధి, మే 6, తరంగాలు :**

బాలసముద్రం ఎన్. టీ. ఆర్ ప్రాంగణంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో జే. బి. కల్చరర్ ఆర్ట్స్ సొసైటీ వరంగల్ వారి ఆధ్వర్యంలో 09-05-2026 వ రోజున అంతర్జాతీయ మాతృ మూర్తి దినోత్సవం పురస్కరించుకొని మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాలు -2026 అమ్మ గొప్పతనాన్ని కీర్తిస్తూ సకల కళల జాతర మరియు సినీ, టీ.వి కళాకారులచే నాటిక ప్రదర్శన వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ శ్రీ ఈగ మల్లేశం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జే.బి కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు జడల శివ, కార్యదర్శి పి.ఆర్ ప్రసాద్,జనగాం రాము, పిట్టల మధుసూదన్, మగ్గిడి చందన, ఏ ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



### అధికారం శాశ్వతం కాదు...

# మంచి పేరు శాశ్వతం...

- ప్రజల మధ్య ఉంటేనే నిజమైన ప్రజాసేవ అన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమయ్యాయని వ్యాఖ్య
- వరంగల్ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తున్నామని వెల్లడి

**వరంగల్, మే-06 తరంగాలు ప్రతినిధి**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదలపై కీలక వ్యాఖ్యలు చేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన వరంగల్ నగరాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కూడా మంజూరైనట్లు వెల్లడించారు. నగరాభివృద్ధిలో భాగంగా విమానాశ్రయం, కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్టైల్ పార్క్ వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. శానిటేషన్, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారిస్తోందని చెప్పారు. ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. "అధికారం శాశ్వతం కాదు.. మంచి పేరు మాత్రం ఎప్పటికీ నిలిచిపోతుంది" అని ఎంపీ డాక్టర్



కడియం కావ్య వ్యాఖ్యానించారు. ప్రజల మధ్య ఉంటూ సేవ చేస్తేనే నిజమైన ప్రజాసేవ అవుతుందని అన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కార్పొరేటర్లకు సూచించారు. వరంగల్ నగరానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని పేర్కొంటూ వేయి స్తంభాల ఆలయ అభివృద్ధికి రూ.14 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కుల నిధుల సాధన కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిరంతరం కోరుతున్నామని తెలిపారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషితో విడుదల చేయిస్తున్నారని చెప్పారు. ప్రతి డివిజన్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



## కందిపప్పు ఎక్కువైతే సమస్యలేనా?

- జీర్ణ సమస్యలకు దారితీసే అవకాశం
- మితంగా తీసుకోవాలంటున్న వైద్యులు
- ఆహారంలో సమతుల్యత అవసరమని సూచన



**డెస్క్, మే 06 (తరంగాలు ప్రతినిధి**

కందిపప్పు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అయితే ఇది ఎంత మంచిదైనా మోతాదు మించితే కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారు కందిపప్పు అధికంగా తీసుకుంటే అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. కందిపప్పులో ప్రోటీన్లు అధికంగా ఉండటంతో శరీరానికి శక్తి అందుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే అదే సమయంలో ఇది జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుందని వివరించారు. ఒకేసారి ఎక్కువగా తీసుకుంటే కడుపులో గ్యాస్ ఏర్పడటం, బరువుగా అనిపించడం వంటి సమస్యలు రావచ్చని అంటున్నారు. కొంతమందిలో కందిపప్పు వల్ల అలర్జీ లక్షణాలు కూడా కనిపించవచ్చని వైద్యులు తెలిపారు. చర్మంపై దద్దుర్లు, కడుపు నొప్పి, వాంతులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరి శరీర స్వభావం వేరుగా ఉండటంతో ఆహారపు అలవాట్లలో జాగ్రత్త అవసరమని చెబుతున్నారు. కందిపప్పును బాగా ఉడికించి తీసుకోవడం వల్ల జీర్ణం సులభమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కూరగాయలతో కలిపి తీసుకుంటే మరింత మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు. రోజువారీ ఆహారంలో పరిమిత మోతాదులో మాత్రమే చేర్చడం మంచిదని వైద్యులు అంటున్నారు. ఇటీవల వేగంగా తయారయ్యే ఆహారాల ప్రభావంతో సంప్రదాయ ఆహారాల వినియోగం తగ్గుతున్నప్పటికీ కందిపప్పు వంటి సహజ ఆహారాలకు మంచి ప్రాధాన్యం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఆరోగ్య ప్రయోజనాల కోసం అయినా మితిమీరిన వినియోగం సరైంది కాదని హెచ్చరిస్తున్నారు. సమతుల ఆహారం ఆరోగ్యానికి ఎంతో అవసరమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. కందిపప్పు కూడా సరైన మోతాదులో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. ఆహారపు అలవాట్లలో నియంత్రణ పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.


# మెట్రో ఫేజ్-2కు సీఎం విజ్ఞప్తి

- కేంద్ర మంత్రి ఖట్టర్‌తో రేవంత్ రెడ్డి కీలక సమావేశం
- ఏడు కారిడార్లతో భారీ విస్తరణ ప్రణాళిక
- హైదరాబాద్ భవిష్యత్ రవాణాపై ప్రత్యేక దృష్టి

**ఢిల్లీ, మే 06 (తరంగాలు ప్రతినిధి**

హైదరాబాద్ నగర భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు తక్షణ ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కోరారు. ఢిల్లీలో జరిగిన ఈ కీలక సమావేశంలో మెట్రో ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ ప్రణాళికలపై సమగ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరం రోజురోజుకు విస్తరిస్తోందని, పెరుగుతున్న జనాభా, వాహన రద్దీ కారణంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన, పర్యావరణహిత రవాణా సౌకర్యాలు అందించేందుకు మెట్రో విస్తరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించి కేంద్రానికి సమర్పించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ చేపట్టాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టుకు సుమారు రూ.38,595 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు వెల్లడించారు. ఫేజ్-2 ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం లభిస్తే నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వెనుక ప్రధాన ఉద్దేశం మెట్రో విస్తరణ పనులను మరింత వేగవంతం చేయడమేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వ పరిధిలో ఉండటంతో ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ కార్యక్రమాలు సులభంగా అమలు చేయగలమని వివరించారు. భవిష్యత్ నగరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆర్జీఐ విమానాశ్రయం నుంచి "భారత్ ఫ్యూచర్ సిటీ" వరకు మెట్రో ఫేజ్-3ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కూడా కేంద్రానికి ఇప్పటికే





సమర్పించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మెట్రో నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. మెట్రో విస్తరణతో నగరంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా దోహదం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఐటీ కారిడార్లు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, నివాస ప్రాంతాలను అనుసంధానించే విధంగా మెట్రో మార్గాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె. శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ పట్టణ రవాణా సలహాదారు ఎన్‌వీఎస్ రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ పూర్తయితే నగర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రావడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. మెట్రో నెట్‌వర్క్ విస్తరణ ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని అధికారులు వెల్లడించారు.

## నూతన వధువరులను ఆశీర్వదించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**రాయపర్తి, మే 6,తరంగాలు :**

నూతన వధువరులను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆశీర్వదించారు.వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ బాధ సారయ్య కూతురు వివాహం వీఆర్ గార్డెన్స్ లో జరుగగా ఈ వివాహ వేడుకలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు



అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, గబ్బేట యాకయ్య, సంకినేని ఎల్లస్వామి, బోయిని కొమురయ్య, బోయిని సొమెయ్య బోయిని ముని బోయిని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
గురువారం, 07 మే , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## బెలూన్లతో ప్రమాదమా?

- చిన్న నిర్లక్ష్యమే పెద్ద ముప్పుగా మారే అవకాశం
- చిన్నారుల భద్రతపై వైద్యుల హెచ్చరిక
- ఆటబొమ్మల వినియోగంలో అప్రమత్తత అవసరం



**డెస్క్, మే 06తరంగాలు ప్రతినిధి**
రంగురంగుల బెలూన్లు చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. పుట్టినరోజు వేడుకలు, ఉత్సవాలు, పాఠశాల కార్యక్రమాల్లో బెలూన్ల వినియోగం సాధారణంగా కనిపిస్తుంది. అయితే బెలూన్ల వల్ల కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్న వయస్సు ఉన్న చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పగిలిపోయిన బెలూన్ల ముక్కలను నోట్లో పెట్టుకోవడం వల్ల ఊపిరాడక ప్రమాదం జరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు ఆటలో భాగంగా బెలూన్లను కొరికే అలవాటు కారణంగా రబ్బరు ముక్కలు గొంతులో ఇరుక్కుపోయే ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో వెంటనే వైద్య సహాయం అందకపోతే ప్రాణాపాయం కూడా ఏర్పడవచ్చని హెచ్చరిస్తున్నారు. కొన్ని బెలూన్ల తయారీలో ఉపయోగించే నాసిరకం పదార్థాలు ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బలమైన రసాయన వాసన వచ్చే బెలూన్లను దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు. నాణ్యతలేని బెలూన్లు త్వరగా పగిలిపోవడంతో ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. బెలూన్లలో గాలి నింపేటప్పుడు కూడా జాగ్రత్త అవసరమని నిపుణులు చెబుతున్నారు. అధికంగా గాలి నింపడం వల్ల అవి ఒక్కసారిగా పేలిపడి చెవులకు ఇబ్బంది కలిగించే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా ముఖానికి దగ్గరగా పెట్టుకుని ఊదకూడదని సూచిస్తున్నారు. పండుగలు, వేడుకల్లో అలంకరణ కోసం బెలూన్లు వాడేటప్పుడు చిన్నారులపై పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు. వాడిపోయిన లేదా పగిలిన బెలూన్లను వెంటనే తొలగించాలని సూచిస్తున్నారు. ఆటబొమ్మల విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరిస్తున్నారు. చిన్న జాగ్రత్తలు పెద్ద ప్రమాదాలను నివారించగలవని నిపుణులు చెబుతున్నారు. బెలూన్లు వినోదాన్ని అందించినా భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని సూచిస్తున్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటే చిన్నారులను ప్రమాదాల నుంచి రక్షించవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు

## హోండా కార్లపై 2 లక్షల డిస్కౌంట్



**న్యూఢిల్లీ, మే 6 : తరంగాలు ప్రతినిధి**
ప్రముఖ కార్ల సంస్థ హోండా తన మాడళ్లపై ప్రత్యేకంగా డిస్కౌంట్‌లో అందిస్తున్నది. ప్రస్తుత నెలలో మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద రూ.2.12 లక్షల వరకు రాయితీ ప్రకటించింది. ఈ ఆఫర్ అమేజ్, సిటీ మాడళ్లకు వర్తించనున్నదని పేర్కొంది. ఈ నెల 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద నగదు డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ ప్రయోజనాలు కల్పిస్తున్నది. హోండా ఎలివేట్‌పై అత్యధికంగా రూ.2.12 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చునని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ కారు రూ.11.60 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నది. అలాగే హోండా సిటీపై రూ.1.56 లక్షల రాయితీ ఇస్తున్న సంస్థ..అమేజ్‌పై రూ.67 వేల ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది.

## ఈవీలకు పెరుగుతున్న డిమాండ్..

- ఏప్రిల్‌లో 23 వేల పీవీ విక్రయాలు : ఫాడా



**న్యూఢిల్లీ, మే 6:**
దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాలకు క్రమంగా డిమాండ్ పెరుగుతున్నది. ఒకవైపు ఇంధన ధరలు భారీగా పుంజు కోనుండగా, మరోవైపు కొనుగోలు దారులు ప్రత్యామ్నాయంగా ఈవీలపై ఫోకస్ పెడుతున్నారు. దీంతో గడిచిన కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలో అమ్ముడవుతున్న ఈవీ ప్యాసింజర్ వాహనాలు గత నెలలోనూ రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఏప్రిల్ నెలలో 23,506 యూనిట్ల ఎలక్ట్రిక్ పీవీ వాహనాలు అమ్ముడయ్యాయని ఆటోమొబైల్ డీలర్ల సంఘాల సమాఖ్య(ఫాడా) తాజాగా వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో అమ్ముడైన 13,421 యూనిట్లతో పోలిస్తే 75.14 శాతం అధికమని పేర్కొంది. గడిచిన నెలలో టాటా మోటర్స్ ప్యాసింజర్ సంస్థ 8,543 యూనిట్ల వాహనాలను విక్రయించింది. కిందటేడాది ఇదే నెలలో అమ్ముడైన 4,822 యూనిట్ల కంటే ఇది 77.17 శాతం అధికమని పేర్కొంది. అలాగే మహీంద్రా అండ్ మహీంద్రా కూడా 5,413 యూనిట్ల ఈవీలను సేల్ చేసింది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ 5 వేల యూనిట్ల కార్లను దేశీయంగా విక్రయించింది.

### లక్ష దాటిన ద్విచక్ర వాహనాలు

కార్లతోపాటు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు కూడా ఎనలేని డిమాండ్ నెలకొన్నది. గత నెలలో ఏకంగా 1,48,740 యూనిట్ల ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయని ఫాడా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 92,538 యూనిట్లతో పోలిస్తే 60 శాతం అధికమని పేర్కొంది. వీటిలో టీవీఎస్ మోటర్ కంపెనీ 37,683 యూనిట్ల వాహనాలను విక్రయించగా, బజాజ్ ఆటో 32,898 యూనిట్లు, ఏథర్ ఎనర్జీ 27,034 యూనిట్లు వాహనాలను విక్రయించా యి. అలాగే 64,549 యూనిట్ల ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలు అమ్ముడవగా, ఎలక్ట్రిక్ కమర్షియ ల్ వాహనాలు రెండింతలు పెరిగి 2,245 యూనిట్లకు చేరుకున్నాయి.

# కేటీఆర్ వ్యాఖ్యలపై సీతక్క ఫైర్

- రైతుల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలకు ఎంతో తేడా
- అహంకార వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని హెచ్చరిక

**హైదరాబాద్, మే 06 (తరంగాలు ప్రతినిధి**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో స్పందించారు. రైతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనల మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని ఆమె పేర్కొన్నారు. కేటీఆర్ తన అహంకారపూరిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు రుణమాఫీని నాలుగు విడతలుగా అమలు చేసి రైతులను తీవ్ర



ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఆ సమయంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బాధిత రైతు కుటుంబాలకు భరోసా కల్పించిందని సీతక్క తెలిపారు. గత ప్రభుత్వం పంట బోనస్ హామీని అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బోనస్ అందిస్తోందని పేర్కొన్నారు. రైతు బంధు నిధుల విడుదలలో గతంలో తీవ్ర జాప్యం జరిగేదని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను విడుదల చేసి రైతులకు సహాయం అందించిందని వివరించారు. తాము ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నామని, ఫామ్ హౌస్‌లు లేదా విదేశీ పర్యటనలకే పరిమితం కాలేదని కేటీఆర్‌పై పరోక్ష విమర్శలు చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన కమీషన్ల దందాల గురించి రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని అన్నారు. అటువంటి వారు ఇప్పుడు కమీషన్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని సీతక్క వ్యాఖ్యానించారు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోకపోతే భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కేటీఆర్‌ను హెచ్చరించారు.

# ప్రత్యేక ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యల స్వీకరణ

- కొండాయి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమం
- మంత్రి సీతక్కతో కలిసి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్
- గ్రామీణ, గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు



**ములుగు, మే 06 తరంగాలు ప్రతినిధి:**
ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామంలో ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి ములుగు జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కొండాయి, దొడ్ల, మల్యాల, దొడ్ల కొత్తూరు, గోవిందరాజుల కాలనీ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, రహదారులు, భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, గిరిజన అభివృద్ధికి సంబంధించిన వినతులను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమాల ద్వారా అధికారులు నేరుగా గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడం వల్ల పరిష్కార ప్రక్రియ వేగవంతమవుతోందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# పిల్లలకు బెల్లం మంచిదేనా?

- సహజ తీపిలో ఆరోగ్య రహస్యాలు
- చక్కెరకు బదులుగా బెల్లం వైపు తల్లిదండ్రుల మొగ్గు
- పరిమిత మోతాదులో ఇస్తేనే పూర్తి ప్రయోజనం

**డెస్క్, మే 06 తరంగాలు ప్రతినిధి**
పిల్లల ఆహారంలో బెల్లం వాడకం గురించి తల్లిదండ్రుల్లో ఆసక్తి పెరుగుతోంది. సహజ సిద్ధమైన తీపి పదార్థంగా గుర్తింపు పొందిన బెల్లం, శరీరానికి అవసరమైన కొన్ని ఖనిజాలను అందించడంలో సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చక్కెరతో పోలిస్తే బెల్లంలో ఇనుము, కాల్షియం, పొటాషియం వంటి పోషకాలు కొంతమేర లభిస్తాయని వివరించారు. పిల్లలకు తగిన మోతాదులో బెల్లం ఇవ్వడం వల్ల శరీరానికి శక్తి త్వరగా అందుతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే పిల్లలు అలసటగా ఉన్నప్పుడు బెల్లంతో చేసిన లడ్డూలు, పానకాలు, చిరుతిండి పదార్థాలు ఉపయోగపడతాయని అంటున్నారు. రక్తహీనత సమస్య ఉన్న చిన్నారులకు కూడా బెల్లం కొంతమేర మేలు చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ మెరుగుపడటంలో కూడా బెల్లం సహాయపడుతుందని చెబుతున్నారు. భోజనం తరువాత చిన్న ముక్క బెల్లం తినడం వల్ల జీర్ణక్రియ సులభంగా జరుగుతుందని పెద్దలు చాలాకాలంగా పాటిస్తున్న అలవాటు. పిల్లల్లో మలబద్ధకం సమస్య తగ్గించడంలో కూడా ఇది కొంత సహకరిస్తుందని



ఆరోగ్య నిపుణులు తెలిపారు. అయితే బెల్లం మంచిదని ఎక్కువగా ఇవ్వడం సరైంది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధికంగా తింటే పళ్ల సమస్యలు, బరువు పెరగడం వంటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. రోజుకు చిన్న మోతాదులో మాత్రమే ఇవ్వడం మంచిదని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఒక సంవత్సరానికి తక్కువ వయస్సు ఉన్న శిశువులకు వైద్యుల సలహా లేకుండా కొత్త ఆహార పదార్థాలు ఇవ్వకూడదని చెబుతున్నారు. మార్కెట్లో లభించే కల్తీ బెల్లం విషయంలో కూడా జాగ్రత్త అవసరమని అధికారులు హెచ్చరిస్తున్నారు. రంగు కోసం రసాయనాలు కలిపిన బెల్లం ఆరోగ్యానికి హానికరమవుతుందని తెలిపారు. అందువల్ల విశ్వసనీయ ప్రాంతాల నుంచి మాత్రమే బెల్లం కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సహజ ఆహారాలపై దృష్టి పెట్టడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. బెల్లం కూడా అలాంటి సహజ ఆహారాల్లో ఒకటేనని, కానీ సమతుల ఆహారంలో భాగంగా మాత్రమే ఉపయోగించాలని సూచిస్తున్నారు. సరైన మోతాదులో ఇస్తే పిల్లల ఆరోగ్యానికి బెల్లం ఉపయోగకరంగా మారుతుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

## గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్

• పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు



**వరంగల్ ప్రతినిధి , మే 6, తరంగాలు :**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు పలికారు. నగరంలోని వేంకటేశ్వర గార్డెన్‌లో కార్పొరేటర్లకు వీడ్కోలు సమావేశాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగర మేయర్ గుండు సుధారాణి వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి హాజరై పాలకవర్గం చేసిన సేవలను కొనియాడారు. వరంగల్ హనుమకొండ, జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద , చాహత్ బాజ్పేయి, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, అదనపు మేయర్ రిజ్వానా, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, జీడబ్ల్యూఎంసీ పాలకవర్గం నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. కార్పొరేటర్లు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అభినందించారు.



# ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



• కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

**హన్మకొండ ప్రతినిధి, మే 6,తరంగాలు :**
గ్రామ దేవతల ఆశీర్వాదంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆకాంక్షించారు. ఐనవోలు మండలం గర్మిళ్ళపల్లి గ్రామంలో శ్రీ భూదేవి, నాభిశిల, శీతలాదేవి బొడ్రాయి మరియు శివాలయ ధ్వజాస్తంభరోహణం, శ్రీ కట్ట మైసమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం చివరి రోజు బుధవారం అంగరంగ వైభవంగా వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని భగవంతుణ్ణి వేడుకున్నారు. ఈ ఉత్సవాల కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గబ్బెట రోజా – అశోక్, ఉప సర్పంచ్ ఎల్లా గౌడ్, చెరుకు లక్ష్మీ కాంతమ్మ, చెన్న గౌరీ లక్ష్మీ, గంకిడి వెంకటేశ్వర్ రెడ్డి, బీరం దేవేందర్ రెడ్డి, పోరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, గండి రమేష్, రాజరపు ఎల్లయ్య, సార్ల సురేష్, ఎల్. వెంకట్ రెడ్డి, మారెపల్లి శ్రీనివాస్ రెడ్డి మరియు గ్రామ బొడ్రాయి ప్రతిష్ట ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# ఎక్కువగా ప్రాచుర్యం పొందుతున్న లింఫాటిక్ మసాజ్.. అసలేంటిది.. ఎలాంటి లాభాలను ఇస్తుంది..?



శరీరంలో బ్లోటింగ్, వాపు, అలసట వంటి సమస్యలు తరచూ ఎదురవుతున్నాయా? అయితే తాజాగా ప్రాచుర్యంలోకి వచ్చిన లింఫాటిక్ మసాజ్ అనే పద్ధతి ఈ సమస్యలకు ఉపశమనం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఇది పూర్తిగా నిరూపితమైన చికిత్స కాదని, ముఖ్యంగా డిటాక్స్ లేదా సాధారణ బ్లోటింగ్ విషయంలో ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. లింఫాటిక్ మసాజ్ కు మరో పేరు మాన్యువల్ లింఫాటిక్ డ్రైనేజ్. శరీరంలోని లింఫాటిక్ వ్యవస్థను ఉత్తేజపరచే సున్నితమైన మసాజ్ పద్ధతి. ఈ వ్యవస్థ శరీరంలో వ్యర్థాలు, టాక్సిన్లు, అదనపు ద్రవాన్ని తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణ డీప్ టిష్యూ మసాజ్‌లకు భిన్నంగా, ఇందులో తేలికైన, రిథమిక్ స్ట్రోక్స్‌తో లింఫ్ ద్రవ ప్రవాహాన్ని మెరుగుపరుస్తారు.

### ద్రవ ప్రవాహాన్ని మెరుగు పరిచే మసాజ్..

బ్లోటింగ్ సమస్య కేవలం ఆహారం వల్ల మాత్రమే కాకుండా, నీటి నిల్వ (వాటర్ రిటెన్షన్), రక్తప్రసరణ లోపం, హార్మోన్ మార్పులు, జీర్ణక్రియ సమస్యలు, ఎక్కువసేపు కూర్చోవడం వంటి కారణాల వల్ల కూడా వస్తుంది. లింఫాటిక్ వ్యవస్థ సరిగా పనిచేయకపోతే శరీరంలో ద్రవం నిల్వ అయి భారంగా అనిపించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మసాజ్ ద్వారా ద్రవ ప్రవాహం మెరుగుపడి వాపు, పఫినెస్ తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే శరీరంలోని వ్యర్థాలను తొలగించే ప్రక్రియకు మద్దతు లభిస్తుంది. రక్తప్రసరణ మెరుగుపడటంతో శరీరం తేలికగా, ఉత్సాహంగా అనిపిస్తుంది. కొందరు వ్యక్తులు దీన్ని తరచూ చేయడం వల్ల జీర్ణక్రియ కూడా కొంతవరకు మెరుగుపడిందని చెబుతున్నారు.

### తేలికగా, మృదువుగా..

ఒక సాధారణ లింఫాటిక్ మసాజ్ సెషన్‌లో తేలికైన, స్లో స్ట్రోక్స్ ఉపయోగిస్తారు. ముఖ్యంగా మెడ, పొత్తికడుపు, చేతులు, కాళ్లపై దృష్టి పెడతారు. ఇది రిలాక్సింగ్‌గా ఉండే ప్రక్రియ, తీవ్రంగా ఒత్తిడి ఉండదు. చాలా మందికి వెంటనే తేలికగా అనిపించడం సాధారణం.
ఇంట్లో కూడా కొంతవరకు ఈ మసాజ్ చేయవచ్చు. అయితే నిపుణుల మార్గదర్శకత్వంలో మాత్రమే చేయడం మంచిది. తేలికైన ఒత్తిడితో, మెడ దగ్గర నుంచి ప్రారంభించి, లింఫ్ నోడ్స్ దిశగా నెమ్మదిగా మసాజ్ చేయాలి. అక్కడ తీవ్రంగా ఒత్తిడి చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. క్రమం తప్పకుండా చేయడం ముఖ్యమే గానీ బలంగా చేయడం అవసరం లేదు.

### అందరికీ సెట్ కాదు..

అయితే ఇది ప్రతి ఒక్కరికీ సరిపోదు. ఇన్ఫెక్షన్లు, గుండె సమస్యలు, కిడ్నీ వ్యాధులు లేదా ద్రవ సమతౌల్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. సందేహం ఉంటే వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. లింఫాటిక్ మసాజ్ ఒక సహాయక పద్ధతి మాత్రమే. ఇది మాయమంత్రంలా అన్ని సమస్యలను పరిష్కరించదు. తగినంత నీరు తాగడం, నిత్యం వ్యాయామం చేయడం, లోతైన శ్వాస సాధన, ఉప్పు వినియోగాన్ని నియంత్రించడం, సరైన నిద్ర వంటి మంచి అలవాట్లతో కలిపి చేస్తే దీని ప్రయోజనాలు మెరుగుపడతాయి. శరీరాన్ని చురుకుగా ఉంచడం ద్వారా లింఫాటిక్ వ్యవస్థను సహజంగా సక్రమంగా పనిచేయేలా చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# పిల్లలు పుట్టినప్పుడు బరువు తక్కువగా ఉంటే.. పెద్దయ్యాక స్ట్రోక్ వచ్చే చాన్స్‌లు ఎక్కువే..



తల్లిగర్భంలోనే ప్రారంభమయ్యే ఆరోగ్య ప్రభావాలు జీవితాంతం కొనసాగుతాయని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా పుట్టినప్పుడు బరువు తక్కువగా ఉన్నవారికి పెద్దయ్యాక స్ట్రోక్ ప్రమాదం ఎక్కువగా ఉండొచ్చని కొత్త అధ్యయనం వెల్లడించింది. ఇప్పటి వరకు పెద్దల బరువు, జీవనశైలి వంటి అంశాలకే ప్రాధాన్యం ఇచ్చిన వైద్యులు, ఇకపై జనన సమయంలో బరువును కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు నిర్వహించిన ఈ పరిశోధనలో దాదాపు 8 లక్షల మంది డేటాను విశ్లేషించారు. ఈ అధ్యయనం ప్రకారం, సగటు 3.5 కిలోల కంటే తక్కువ బరువుతో పుట్టినవారికి మొత్తం స్ట్రోక్ ప్రమాదం సుమారు 21 శాతం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఇందులో రక్తనాళం బ్లాక్ అయ్యే ఇస్కీమిక్ స్ట్రోక్‌తో పాటు, మెదడులో రక్తస్రావం జరిగే హేమరేజిక్ స్ట్రోక్‌లు కూడా ఉన్నాయి.

### పురుషుల్లోనే అధికం..

లింగ ఆధారంగా చూసినా ఈ ప్రమాదం స్పష్టంగా కనిపించింది. తక్కువ బరువుతో పుట్టిన మహిళల్లో స్ట్రోక్ ప్రమాదం 18 శాతం పెరిగితే, పురుషుల్లో ఇది 23 శాతం వరకు పెరిగినట్లు అధ్యయనం తెలిపింది. ముఖ్యంగా ఈ ప్రభావం వ్యక్తి పెద్దయ్యాక బరువు ఎలా ఉన్నా కొనసాగుతుండటం గమనార్హం. అంటే తరువాత సాధారణ బరువులో ఉన్నా, చిన్నప్పటి తక్కువ జనన బరువు ప్రభావం పూర్తిగా తగ్గిపోదని అర్థం. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం తక్కువ బరువుతో పుట్టడం అనేది గర్భంలో ఎదుగుదల సరిగా జరగలేదని సూచిస్తుంది. ఇది గుండె, రక్తనాళాలు, మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపి, భవిష్యత్తులో రక్తపోటు నియంత్రణలో మార్పులు లేదా రక్తనాళ నిర్మాణంలో లోపాలకు దారితీసే అవకాశం ఉంటుంది. ఈ కారణాల వల్లే స్ట్రోక్ ప్రమాదం పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.

### జనన బరువు కూడా ముఖ్యమే..

ఇప్పటి వరకు స్ట్రోక్ ప్రమాదాన్ని అంచనా వేయడంలో రక్తపోటు, కొలెస్ట్రాల్, ధూమపానం, డయాబెటిస్ వంటి అంశాలపై దృష్టి సారించేవారు. కానీ ఈ కొత్త పరిశోధనతో, జనన బరువు కూడా ఒక ముఖ్య సూచికగా మారే అవకాశముంది. తక్కువ బరువుతో పుట్టినవారిని వైద్యులు మరింత జాగ్రత్తగా పరిశీలించి, ముందస్తు జాగ్రత్తలు సూచిస్తారు. అయితే తక్కువ బరువుతో పుట్టిన ప్రతి ఒక్కరికీ స్ట్రోక్ వస్తుందనేది తప్పు. అలాగే, పెద్దయ్యాక అధిక బరువు లేదా చెడు జీవనశైలి ప్రభావం ఉండదని కూడా కాదు. ఆరోగ్యకరమైన ఆహారం, నియమిత వ్యాయామం, ధూమపానం నివారణ, రక్తపోటు నియంత్రణ వంటి మంచి అలవాట్లు పాటించడం ద్వారా స్ట్రోక్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఆరోగ్యం అనేది గర్భస్థ దశ నుంచే ప్రారంభమయ్యే ప్రయాణమని ఈ అధ్యయనం మరోసారి స్పష్టం చేస్తోంది.

# రోజూ మీరు తీసుకునే ఈ ఆహారాల్లో ఉప్పు అధికంగా ఉంటుందనే విషయం తెలుసా..?

చాలా మంది చేసే వంటలకు ప్రత్యేక రుచిని తీసుకురావడంలో ఉప్పు ముఖ్య పాత్ర పోషిస్తుంది. వంటలు రుచిగా ఉండాలంటే ఉప్పు వేయాల్సిందే. అయితే రోజువారీ ఆహారంలో ఉప్పు వినియోగం గురించి చాలా మంది పెద్దగా ఆలోచించరు. కానీ అధిక సోడియం తీసుకోవడం గుండె ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మనకు తెలియకుండానే తీసుకునే సోడియంలో 70 శాతానికి పైగా ప్యాకేజ్డ్ ఫుడ్స్, రెస్టారెంట్ ఆహారాల నుంచే వస్తోంది. ఇవి రుచికి ఉప్పుగా అనిపించకపోయినా, లోపల సోడియం మోతాదు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అధిక సోడియం వినియోగం కేవలం రక్తపోటు పెరగడానికే కాదు, గుండె వ్యాధులు, కిడ్నీ సమస్యలు, ఎముకల బలహీనత, మెదడు సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. శరీరంలోని ద్రవ సమతౌల్యాన్ని దెబ్బతీసి, గుండెపై అదనపు ఒత్తిడిని పెంచుతుంది. దీర్ఘకాలంలో రక్తనాళాలు కఠినంగా మారి, గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది.

### ప్రాసెస్ చేసిన ఆహారాలు..



ప్రాసెస్ చేసిన ఆహారాలు సోడియం అధికంగా ఉండే ప్రధాన వనరులు. ఫ్రోజన్ మీల్స్, కాన్డ్ సూప్స్, లంచ్ మీట్స్ వంటి వాటిలో నిల్వ ఉంచడానికి, రుచి కోసం ఎక్కువ ఉప్పు ఉపయోగిస్తారు. అంతేకాకుండా ఇన్‌స్టంట్ ఓట్స్, సిరియల్స్ వంటి తీపి పదార్థాల్లో కూడా ప్రిజర్వేటివ్‌గా ఉప్పు వాడటం సాధారణంగా మారింది. కండిమెంట్స్, సాస్‌లు కూడా సోడియం పెంచే అంశాల్లో ముందుంటాయి. కెచప్, సోయా సాస్, సలాడ్ డ్రెస్సింగ్స్, మారినేడ్స్ వంటి వాటిని ఎక్కువగా వాడటం ద్వారా రోజువారీ సోడియం మోతాదు తెలియకుండానే పెరుగుతుంది. అలాగే స్నాక్ ఫుడ్స్ విషయంలో మరింత జాగ్రత్త అవసరం. చిప్స్, నమకీన్, భుజియా, సాల్టెడ్ నట్స్ వంటి వాటిని తరచూ తీసుకుంటే సోడియం స్థాయి త్వరగా పెరుగుతుంది. అలాగే బ్రెడ్, బేకరీ ఉత్పత్తుల్లో కూడా ఉప్పు ఉండటం వల్ల అవి కూడా సోడియం వనరులుగా మారుతున్నాయి.

### ఇలా చేయాలి..

చీజ్, పచ్చళ్ళు (పికిల్స్) కూడా అధిక సోడియం కలిగిన ఆహారాలు. ముఖ్యంగా ఒక స్పూన్ నిల్వ పచ్చడిలో 300 నుంచి 600 మిల్లీగ్రాముల వరకు సోడియం ఉంటుంది. ప్యాకేజ్డ్ పనీర్‌లో కూడా నిల్వ కోసం ఉప్పు కలుపుతారు. కనుక ఈ ఆహారాలను తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండడం చాలా అవసరం. ఇక సోడియం వినియోగాన్ని నియంత్రించడానికి కొన్ని సాధారణ అలవాట్లు చాలా ఉపయోగపడతాయి. ఆహార పదార్థాలపై ఉన్న న్యూట్రిషన్ లేబుల్స్‌ను తప్పనిసరిగా చదవాలి. తక్కువ సోడియం ఉన్న ఉత్పత్తులను ఎంపిక చేసుకోవాలి. ఇంట్లో వంట చేసుకోవడం ద్వారా ఉప్పు పరిమాణాన్ని నియంత్రించవచ్చు. రుచి కోసం తాజా కూరగాయలు, మసాలాలు ఉపయోగించడం మంచిది. సోడియం వినియోగంపై అవగాహన పెంచుకుని, జాగ్రత్తగా ఆహారం ఎంచుకుంటే గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుంది. చాలా మంది చేసే ఈ చిన్న మార్పులు పెద్ద ప్రయోజనాలను అందిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# ఎల్లమ్మ మూవీలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్





బలగం' వంటి హృదయాన్ని తాకే ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకుడు వేణు యెల్దండి తన రెండో సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతు న్నారు. 'ఎల్లమ్మ' అనే ప్రత్యేకమైన టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై సాగుతున్న ఉత్కంఠకు ఇప్పుడు తెరపడుతున్నట్లు సమాచారం.తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో నటనకు అత్యంత ప్రాధాన్యం ఉన్న పాత్ర కోసం దర్శకుడు చాలా జాగ్రత్తగా హీరోయిన్‌ను ఎంపిక చేయాలని భావించారు. ప్రారంభంలో ఈ పాత్ర కోసం సాయి పల్లవిను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. అయితే డేట్స్ సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాత కీర్తి సురేష్ పేరు బలంగా వినిపించింది. ఒక దశలో ఆమె ఎంపిక దాదాపు ఖాయమని కూడా ప్రచారం జరిగింది. వీరితో పాటు శృతి హాసన్, భాగ్యశ్రీ బోర్సే, కన్నడ నటి రుక్మిణి వసంత్ పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం 'సీతా రామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ ఈ పాత్రకు దాదాపు ఫైనల్ అయినట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. భావోద్వేగ సన్నివేశాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకునే మృణాల్ ఈ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఇక ఈ చిత్రంలో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, ఫేమస్ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'పార్శి' అనే శక్తివంతమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ఆయన లుక్‌కు మంచి స్పందన వచ్చింది. అంతేకాదు, ఈ చిత్రానికి సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు. 'ఎల్లమ్మ' సినిమా తెలంగాణ సంప్రదాయాలు, జానపద కళలు, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన కథగా రూపొందుతోంది. గ్లింప్స్‌లో చూపించిన వేప ఆకులు, పసుపు, కుంకుమ, గజ్జెల శబ్దాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్‌లు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. హీరోయిన్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే షూటింగ్ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లోనూ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# 600 కోట్ల భారీ బడ్జెట్‌తో రజనీ , కమల్ మూవీ



దక్షిణాదిలో మాత్రమే కాకుండా మొత్తం భారతీయ సినీ పరిశ్రమలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారిన భారీ ప్రాజెక్ట్ ఏదైనా ఉందంటే అది సూపర్ స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ కలిసి నటించబోతున్న మల్టీస్టారర్ సినిమా. ఈ చిత్రాన్ని ప్రతిభావంతుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమాపై భారీ స్థాయిలో అంచనాలు నెలకొనగా, తాజాగా వినిపిస్తున్న వార్తలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. సినీ వర్గాల్లో ప్రచారం ప్రకారం ఈ సినిమాకు సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్ కేటాయించినట్టు సమాచారం. ఇది నిజమైతే భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలిచే అవకాశముంది. ఈ భారీ వ్యయంలో ఎక్కువ భాగం ప్రధాన నటులు మరియు సాంకేతిక బృందం పారితోషికాలకే వెళ్తున్నట్టు తెలుస్తోంది.ముఖ్యంగా రజినీకాంత్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు ఒకే సినిమాలో నటించడం వల్ల వారి పారితోషికాలు కూడా అత్యంత భారీగా ఉన్నాయని సమాచారం. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కూడా తన విజయాల నేపథ్యంలో మంచి మొత్తాన్ని అందుకుంటున్నట్టు తెలుస్తోంది.

ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నది ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ రవిచందర్ కాగా, ఆయన సంగీతం ఈ సినిమాకు మరో ప్రధాన బలం కానుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను కమల్ హాసన్‌కు చెందిన నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ నిర్మిస్తోంది. అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. ప్రస్తుతం ముందస్తు పనులు వేగంగా కొనసాగుతుండగా, త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. ఇంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ మల్టీస్టారర్‌ను దర్శకుడు నెల్సన్ ఎలా రూపొందిస్తాడో అన్నది ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. మొత్తానికి రజినీకాంత్ , కమల్ హాసన్ కలయిక, నెల్సన్ దర్శకత్వం, అనిరుధ్ సంగీతం కలిసివచ్చి ఈ సినిమాను భారతీయ సినీ రంగంలో ఒక కొత్త మైలురాయిగా నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## విరాట్ కోహ్లీ రికార్డును బ్రేక్ చేసిన రోహిత్ శర్మ

ఐపీఎల్ లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అదరగొట్టింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన పోరులో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తన క్లాస్ పవర్ ఏంటో చూపించాడు. గత కొన్ని మ్యాచులకు దూరంగా ఉన్న హిట్ మ్యాన్.. ప్లేయింగ్ ఎలెవన్ లోకి తిరిగి వచ్చిన వెంటనే విధ్వంసం సృష్టించాడు. అతని మెరుపు బ్యాటింగ్ ధాటికి లక్నో నిర్దేశించిన భారీ లక్ష్యం ముంబై ముందు చిన్నబోయింది. ఈ మ్యాచ్ రోహిత్ శర్మకు బ్యాటింగ్‌లోనే కాకుండా ఒక ప్లేయర్‌గా కూడా చాలా స్పెషల్. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక మ్యాచులు ఆడిన ఆటగాళ్ల జాబితాలో రోహిత్ ఇప్పుడు రెండో స్థానానికి చేరుకున్నాడు. విరాట్ కోహ్లీ (276 మ్యాచులు)ని అధిగమించి, 277వ మ్యాచ్‌తో రోహిత్ ఈ ఘనత సాధించాడు. ప్రస్తుతం ఎంఎస్ ధోనీ 278 మ్యాచులతో అగ్రస్థానంలో ఉన్నాడు. ధోనీ ఈ సీజన్‌లో ఇంకా బరిలోకి దిగకపోవడంతో రోహిత్, కోహ్లీ ఇద్దరూ త్వరలోనే అతన్ని దాటే అవకాశం ఉంది. ముంబై ఇండియన్స్ స్పిన్నర్ రఘు శర్మ ప్రస్తుతం ఐపీఎల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అక్షత్ రఘువంశీని అవుట్ చేసిన తర్వాత అతను చూపించిన ఎమోషనల్ నోట్ అందరినీ ఆకట్టుకుంది. ఆ సెలబ్రేషన్ వెనుక ఉన్న అసలు కారణాన్ని, తన కష్టతరమైన జర్నీని రఘు శర్మ తాజాగా వివరించాడు. తన లైఫ్ మారడానికి ఎంఎస్ ధోనీనే కారణమని అతను చెప్పుకొచ్చాడు. “ఇదంతా 2011 సమయంలో మొదలైంది. మా ఇంట్లో అందరూ డాక్టర్లు, ఇంజనీర్లు ఉండటంతో నేను కూడా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. కానీ అప్పుడు నేను చాలా లావుగా ఉండేవాడిని. సుమారు 102 కిలోల బరువు ఉండేవాడిని.

## సల్మాన్ మూవీలో విలన్‌గా అక్షయ్ ఖన్నా ?



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో వంశీ పైడిపల్లి సినిమా తీయనున్న విషయం తెలిసిందే. ఎస్‌విసి63' అనే టైటిల్‌తో ప్రచారంలో ఉంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. ఈ కండల వీరుడితో ఢీ కొట్టేందుకు విలన్ పాత్ర కోసం ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి. మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్, బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా ఈ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు ఏమాత్రం తగ్గకుండా నటనలో ఆయనకు గట్టి పోటీ ఇచ్చే విలన్ ఉండాలని చిత్ర బృందం భావిస్తోందట. అందుకే ఈ ఇద్దరిలో ఒకరిని ఫైనల్ చేసే దిశగా చర్చలు జరుగుతున్నాయి. ప్రముఖ నిర్మాత దిల్ రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 ఈద్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఇందులో సల్మాన్‌కు జోడీగా అగ్ర కథనాయిక నయనతార నటిస్తుండగా.. సీనియర్ నటుడు అరవింద్ స్వామి ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ముంబయిలో దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నయనతార కూడా ఈ తాజా షెడ్యూల్‌లో పాల్గొన్నారు. సల్మాన్ ఖాన్ మాస్ ఇమేజ్‌కు వంశీ పైడిపల్లి స్టైలిష్ టేకింగ్ తోడైతే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

## లెనిన్ మూవీలో భాగ్యశ్రీ లుక్ విడుదల




'లెనిన్'లో అఖిల్‌తో కలిసి సందడి చేయడానికి సిద్ధవ ుుతున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ఓ స్పెషల్ పోస్టర్‌తో ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె భారతి అనే పాత్రలో అలరించనున్నారు. తాజాగా పంచుకున్న పోస్టర్‌లో ఆమె పౌరాణిక లుక్‌లో రాచరికపు దుస్తులు, భారీ ఆభరణాలు ధరించి కనిపించారు. తీక్షణమైన చూపులతో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా వాయిదా పడనుందంటూ వార్తలు రాగా నాగార్జున తన పోస్ట్‌తో వాటిని ఖండించారు. అనుకున్న తేదీ ప్రకారం జూన్ 26న ఈ సినిమా విడుదల కానున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో కొత్త అఖిల్‌ను చూస్తారని హామీ ఇచ్చారు. తాను ఫస్ట్ కట్ చూశానని అది చూశాకే నమ్మకంతో చెబుతున్నానన్నారు. చిత్తూరు నేపథ్యంలో సాగే కథ ఇది. బలమైన భావోద్వేగాలు, ఆసక్తిని రేకెత్తించే కథనంతో ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచేలా 'లెనిన్' చిత్రం రూపుదిద్దుకొంటోంది.

## నితిన్ కొత్త సినిమా పూజా కార్యక్రమంతో ప్రారంభరం

యంగ్ హీరో నితిన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై రూపొందుతున్న తాజా చిత్రం నేడు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైన ఈ చిత్ర ప్రారంభోత్సవానికి చిత్ర యూనిట్ సభ్యులు హాజరై సందడి చేశారు. ఈ సినిమా ద్వారా సోము నర్రి దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతుండగా, 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ నితిన్ సరసన కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఇతర పనులు పూర్తి చేసుకుని, మే రెండో వారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది. వరుస విజయాలతో జోరు మీదున్న సితార సంస్థ ఈ సినిమాతో నితిన్‌కు ఒక భారీ కమర్షియల్ సక్సెస్‌ను అందించేందుకు సిద్ధమైంది.

